నమస్తే తెలంగాణ
రంగారెడ్డి
I | హైదరాబాద్, శుక్రవారం 5 జూలై 2024 | RANGAREDDY

దొడ్డి కొమురయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రంగారెడ్డి కలెక్టర్ శశాంక

దొడ్డి కొమురయ్య | రంగారెడ్డి కలెక్టర్ శశాంక

స్ఫూర్తిని కొనసాగించాలి

రంగారెడ్డి, జూలై 4 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య చూపిన స్ఫూర్తిని కొనసాగించాలని రంగారెడ్డి కలెక్టర్ శశాంక అన్నారు. గురువారం దొడ్డి కొమురయ్య వర్ధంతి సందర్భంగా కలెక్టరేట్‌లోని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని, జ్యోతిని వెలిగించి, దొడ్డి కొమురయ్య చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శశాంక మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటానికి దొడ్డి కొమురయ్య తొలి అమరత్వాన్ని ఇచ్చి స్ఫూర్తినిచ్చారని పేర్కొన్నారు. తెలంగాణలో భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడారన్నారు. రైతాంగ సాయుధ పోరాటంలో కొమురయ్య కనబర్చిన తెగువ, పోరాట పటిమను ఈ సందర్భంగా వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారిణి సంగీత, బీసీ సంక్షేమ శాఖ అధికారిణి నీరజారెడ్డి, ఏవో నరసింహారావు, బీసీ ఫ్రంట్ చైర్మన్ మల్లేశ్‌కురుమ, కేవైసీఎస్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేందర్‌కురుమ, కేవైసీఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీశైలం, ప్రధాన కార్యదర్శి కృష్ణ, రాజేందర్ కురుమ, పర్వతాలు, శేఖర్, అధికారులు, హాస్టల్ వార్డెన్లు పాల్గొన్నారు.

27 కేజీల గంజాయి స్వాధీనం

పెద్దఅంబర్‌పేట, జూలై 4 : హైవేపై తరలిస్తున్న 27 కేజీల గంజాయిని అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు పట్టుకున్నారు. నిందితుల్లో మైనర్ కూడా ఉన్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. బుధవారం అర్ధరాత్రి తర్వాత విజయవాడ జాతీయ రహదారిపై పెద్దఅంబర్‌పేట ఓఆర్‌ఆర్ వద్ద పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ కారును తనిఖీ చేయగా.. అందులో ఒడిశాకు చెందిన బలరామ్, రాజాకపస్య, విజయ్‌హల్దార్, మరో మైనర్ కారులో ఒడిశా నుంచి హైదరాబాద్‌కు 27 కేజీల బరువున్న 36 ప్యాకెట్ల గంజాయి తరలిస్తున్నట్లు గుర్తించారు. నిందితులను అదుపులోకి తీసుకు ని, గంజాయితోపాటు కారు, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుంట్లూరు భూదాన్ భూమిలో వెలసిన గుడిసెలు

₹1000కి చదరపు గజం!

కుంట్లూరు భూదాన్ భూముల్లో యథేచ్ఛగా గుడిసెల దందా

ఏడాది కిందట రాత్రికి రాత్రే వెలసిన 3-4 వేల గుడిసెలు

ఎలాంటి హక్కులు లేకుండానే చేతులు మారుతున్న స్థలాలు

కోర్టులో వివాదం నడుస్తున్నా కొనుగోలు చేసి మోసపోతున్న అమాయకులు

రూ.వెయ్యికే గజం.. 50 గజాలకు రూ.50 వేలు.. 100 గజాలు కావాలంటే లక్ష రూపాయలు... ఇదేదో మారుమూల ప్రాంతంలో కాదు! విజయవాడ జాతీయ రహదారికి సుమారు మూడు కిలోమీటర్ల దూరంలోనే!!.. కాకపోతే కొనుగోలు చేసిన తర్వాత ఈ స్థలంలోని గుడిసెల్లో కనీసంగా మూడు రోజులపాటు నిద్ర చేయాలి. లేకపోతే మరుసటి రోజే అది వేరే వారి పేరు మీదకు మారుతుంది. మరి... ఇంతకీ ఇందుకు సంబంధించి రిజిస్ట్రేషన్లు, డాక్యుమెంట్లు, పట్టాలు ఉంటాయా అంటే అవేవీ ఉండవు. అక్కడో ప్రైవేట్ సైన్యం ఉంటుంది. వాళ్లు ఒక రిజిస్టర్‌లో పేర్లు నమోదు చేసుకుంటారు అంతే!.

- సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, జూలై 4 (నమస్తే తెలంగాణ)

ఇదీ.. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కుంట్లూరు రెవెన్యూ పరిధి పాపాయిగూడలోని 214-225 సర్వేనంబర్లలోని వాస్తవ పరిస్థితి. నిజానికి ఈ భూమికి సంబంధించి టైటిల్ వివాదమే న్యాయస్థానంలో ఉన్నది. ఈ సర్వేనంబర్లలోని దాదాపు వందెకరాల భూములు తమవి అని కొందరు.. కాదు కాదు భూదాన్ బోర్డు ట్రస్టుకు రాసిన భూములు అని ట్రస్టు వారు వాదిస్తున్నారు. దీంతో ఏండ్ల తరబడి వివాదం న్యాయస్థానంలోనే ఉన్నది. కానీ, గతేడాది జనవరిలో రాత్రికి రాత్రే ఈ భూముల్లో వేలాది గుడిసెలు వెలిశాయి. ఇటీవల మియాపూర్‌లోని హెచ్ఎండీఏ భూముల్లోకి నిరుపేదలు తరలివచ్చినట్లుగా ఇక్కడ కూడా వందలాదిగా తరలివచ్చి గుడిసెలు వేసుకున్నారు. కొంతకాలం ఉంటే ఆ స్థలం తమకు చెందుతుందనే ఆశతో ఇతర జిల్లాలు, హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల నుంచి కూడా నిరుపేదలు వచ్చారు. కనీసం నీళ్లు, కరెంటు, ఇతరత్రా సాధారణ సౌకర్యాలు లేకున్నా నెలల తరబడి ఆ గుడిసెల్లోనే ఉంటున్నారు. అయితే ఈ క్రమంలోనే కొందరు దళారులు అక్కడ రంగప్రవేశం చేశారు. ఉదయం వేళల్లో ఎక్కడ పనికి వెళ్లినా రాత్రికి మాత్రం తమ గుడిసెల్లోకి రావాల్సిందేనన్న నిబంధన విధించారు. ఎవరైనా రాత్రివేళల్లో గుడిసెల్లో నిద్రించేందుకు రాకుంటే వెంటనే ఆ గుడిసెను వేరే వారికి కేటాయిస్తున్నారు. దీంతో కొంతమంది అక్కడి నుంచి వెళ్లిపోగా... చాలామంది రోజంతా ఎక్కడ పని చేసినా రాత్రయ్యే సరికి అక్కడికి వస్తున్నారు. ఈ క్రమంలో రోడ్డు ప్రమాదాల్లో మృత్యువాతపడిన వారు కూడా ఉన్నారు. కాగా దళారులు గుడిసెలవారి నుంచి క్రమంగా డబ్బులు వసూలు చేయడం మొదలుపెట్టారు. తొలుత రూ.5 వేల నుంచి మొదలైన ఈ పర్వం ఇప్పుడు రూ.50 వేలు, రూ. లక్షల్లోకి వెళ్లింది.

ఎలాంటి హక్కులు లేకుండా చేతులు మారుతున్న వైనం..

ఆ గుడిసెల్లో ఉన్న వారికి ఆ భూమి ఎవరిది? అనేది తెలియదు. కానీ కొన్నేండ్ల పాటు అక్కడే ఉంటే ప్రభుత్వం పట్టాలు ఇస్తుందనే ఆశతో అలాగే ఉంటున్నారు. అయితే కొన్నిరోజులుగా దళారుల ప్రమేయంతో ఆ గుడిసెలు చేతులు మారుతున్నాయి. సుమారు 40 చదరపు గజాల విస్తీర్ణంలో వేసిన గుడిసెలను గజానికి రూ.వెయ్యి చొప్పున విక్రయిస్తున్నారు. కాస్త విస్తీర్ణం ఎక్కువగా ఉంటే రూ.50 వేలు, రూ.లక్ష వరకు ధర పలుకుతుంది. ఈ లావాదేవీలకు సంబంధించి ఎలాంటి పత్రాలు ఉండడం లేదు. కేవలం అక్కడ ఉండే దళారులు తమ రిజిస్టర్‌లోనే పేర్లు నమోదు చేసుకుంటున్నారు. కొనుగోలు చేసిన వారు కూడా కచ్చితంగా రాత్రివేళల్లో అందులో నిద్రించాల్సిందే. వరుసగా మూడు రోజులు లేకుంటే అది వేరే వారికి విక్రయిస్తున్నారు. ఆ తర్వాత ఇదేమని ప్రశ్నించినా అక్కడ పట్టించుకునే దిక్కు ఉండదు. వాస్తవానికి ఎలాంటి పత్రాలు లేకుండా కొనుగోలు చేయడమంటే మోసపోవడమే అయినప్పటికీ చాలామంది అమాయకులు గుడ్డిగా నమ్మి వేల రూపాయలు ఇచ్చి కొనుగోలు చేస్తున్నారు. ముఖ్యంగా ఇతర ప్రాంతాల నుంచి హైదరాబాద్‌లో కూలీనాలీ చేసుకుంటున్న వాళ్లే ఇంత నీడ దొరుకుతుందనే ఆశతో కొని మోసపోతున్నారు. వీటిపై రెవెన్యూ, పోలీసు శాఖలకు భారీ ఎత్తున ఫిర్యాదులు అందినా వేలాది మందిగా ఉన్న నిరుపేదలు... పైగా ఆ ప్రాంతాన్ని అనధికారికంగా తమ చేతుల్లోకి తీసుకున్న ఓ ప్రైవేట్ సైన్యం అధికార యంత్రాంగంపై తిరగబడేందుకు సిద్ధమవుతుందని ఒక అధికారి తెలిపారు. దీంతో ఈ ఆక్రమణలను ఎలా తొలగించాలనే దానిపై అధికార యంత్రాంగం మల్లగుల్లాలు పడుతున్నది. కాగా కొన్నిరోజుల కిందట పోలీసులు భారీ బలగాలతో గుడిసెల తొలగింపునకు రంగం సిద్ధం చేసినా... ఆ సమాచారం ముందుగానే తెలుసుకున్న గుడిసెలవాసులు కారం, కర్రలతో తిరుగుబాటుకు సిద్ధం కావడంతో పోలీసులు ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నారు. అనంతరం రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు వెళ్లి గుడిసెలను ఖాళీ చేయాల్సిందిగా వారిని హెచ్చరించారు. దీంతో గుడిసెలవాసులు కొంతమంది సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి అది భూదాన్ భూమి అయినందున ఇండ్ల స్థలాల కింద తమకు వాటిని కేటాయించాల్సిందిగా కోరారు.

గాడి తప్పుతున్న వ్యవస్థ..

గుడిసెలు వెలసిన ప్రాంతం ఒక సామ్రాజ్యంగా మారడంతోపాటు అక్కడ కొందరు వలంటీర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు అనేక మంది బాధితులు ఆవేదన చెందుతున్నారు. ముఖ్యంగా విద్యుత్ సౌకర్యం కూడా లేకపోవడంతో రాత్రివేళల్లో పెద్ద ఎత్తున అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయనే విమర్శలున్నాయి. దీంతో గుడుంబా, గంజాయి వాడకం పెద్ద ఎత్తున జరుగుతుండటంతో శాంతిభద్రతలు గాడి తప్పుతాయనే భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. చోరీలు సైతం పెరిగినట్టు తెలుస్తున్నది. ఈ గుడిసెలో ఏం పోయినా ఎవరిపై ఫిర్యాదు చేయాలో కూడా తెలియక, కిమ్మనకుండా ఉండిపోతున్నట్లు సమాచారం. చోరీల విషయంపై బాధితులు స్థానిక నేతలకే ఫిర్యాదు చేస్తున్నట్లు తెలుస్తున్నది. ఇక అక్కడ నిత్యం జరిగే గొడవలకు అడ్డూఅదుపు లేకుండాపోతున్నది. రాత్రి సమయాల్లో ఆ ప్రాంతం మీదుగా వెళ్లే వారు కూడా భయపడే పరిస్థితి అక్కడ నెలకొంది.

అంతా ప్రత్యేకమే..

- ఇప్పటికే జీపీల్లో స్పెషలాఫీసర్లు
- నాల్గోతేదీతో ముగిసిన జడ్పీటీసీల పదవీకాలం
- మూడోతేదీన ఎంపీటీసీల పదవీ కాలం పూర్తి
- 18 మండలాలకు ప్రత్యేకాధికారుల నియామకం
- వికారాబాద్ జిల్లాలో 18 మంది జడ్పీటీసీలు, 221 మంది ఎంపీటీసీలు
- బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన జడ్పీ చైర్‌పర్సన్
- ఆమెపై అవిశ్వాసం పెట్టిన బీఆర్ఎస్ జడ్పీటీసీలు
- కోరం లేక మిగిలిపోయిన రూ.4 కోట్ల బడ్జెట్

వికారాబాద్, జూలై 4 (నమస్తే తెలంగాణ): స్థానిక సంస్థల్లో పరిషత్‌ల పదవీకాలం పూర్తయింది. ఇప్పటికే సర్పంచుల పదవీ కాలం పూర్తి కాగా ఈ నెల 3తో ఎంపీటీసీలు, ఈ నెల 4తో జడ్పీటీసీల పదవీ కాలం కూడా ముగిసింది. అయితే జిల్లాలో 221 మంది ఎంపీటీసీలు, 18 మంది జడ్పీటీసీలున్నారు. స్థానిక సంస్థల్లో మున్సిపాలిటీలు మినహా మిగతా అందరి పదవీకాలం ముగిసినా ప్రభుత్వం ఇప్పటికీ ఎన్నికలకు సంబంధించి ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో ఇప్పటికే గ్రామ పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతుండగా, తాజాగా మండలాలకూ స్పెషలాఫీసర్లను సర్కారు నియమించింది. జిల్లాలోని 18 మండలాలకు ప్రత్యేకాధికారులను నియమిస్తూ కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయా శాఖల జిల్లా అధికారులను మండలాల ప్రత్యేకాధికారులుగా నియమించారు. ఇప్పటికే గ్రామ పంచాయతీలకు ప్రత్యేకాధికారులుగా ఉన్న పలువురు జిల్లా అధికారులు, ప్రస్తుతం మండలాలకు కూడా ప్రత్యేకాధికారులుగా అదనపు బాధ్యతలు నిర్వర్తించడంతోపాటు వారి శాఖల పనులు కూడా చూసుకోవాల్సి ఉంటుంది.

జడ్పీచైర్‌పర్సన్‌పై అవిశ్వాసం ..

బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలుపొంది జడ్పీ చైర్‌పర్సన్‌గా ఎన్నికైన పట్నం సునీతారెడ్డి లోక్‌సభ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీంతో బీఆర్ఎస్ పార్టీకి నమ్మకద్రోహం చేశారని పేర్కొంటూ ఆ పార్టీ జడ్పీటీసీలు ఆమెపై అవిశ్వాసం ప్రకటించారు. దీంతో జిల్లా పరిషత్‌ల పదవీకాలం ముగిసే చివరి ఆరు నెలలు అవిశ్వాసంతో జిల్లా పరిషత్ అట్టుడికింది. జడ్పీ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తే బీఆర్ఎస్ జడ్పీటీసీలు బహిష్కరించడం, అవిశ్వాసాన్ని సత్వరమే అమలు చేయాలంటూ కోర్టుకు కూడా వెళ్లారు. అయితే చివరగా అవిశ్వాసాన్ని అమలు చేసేందుకు కోర్టు ఆదేశాలిచ్చినా పదవీకాలం ముగిసేందుకు కేవలం 20 రోజులే ఉండడంతో అవిశ్వాసం ప్రక్రియ ఆగిపోయింది. మరోవైపు జడ్పీలో రూ.4కోట్ల బడ్జెట్ మిగిలిపోయింది. కాంగ్రెస్ నుంచి కేవలం నలుగురు సభ్యులు మాత్రమే ఉండడం, బడ్జెట్ ఆమోదించేందుకు సరైన కోరం లేకపోవడంతో వినియోగించకుండానే బడ్జెట్ మిగిలిపోయింది. బీఆర్ఎస్ నుంచి గెలుపొందిన జడ్పీ చైర్‌పర్సన్ కాంగ్రెస్ పార్టీతో పదవీ కాలాన్ని ముగించారు. అయితే బీఆర్ఎస్ నుంచి 16 మంది జడ్పీటీసీలు గెలుపొందగా, పదవీకాలం ముగిసేనాటికి 14 మంది జడ్పీటీసీలే బీఆర్ఎస్‌తోనే ఉండడం గమనార్హం.

మండలాల ప్రత్యేకాధికారులు వీరే..

మండలం	ప్రత్యేకాధికారి
వికారాబాద్	జడ్పీసీఈవో- సుధీర్
ధారూరు	డీఎస్‌సీడీవో- మల్లేశం
కోట్‌పల్లి	సీపీవో- అశోక్
మర్పల్లి	డీసీవో- ఈశ్వరయ్య
బంట్వారం	డీఐఈవో- శంకర్‌నాయక్
మోమిన్‌పేట	డీఎఫ్‌వో-సౌజన్య
పరిగి	డీఆర్‌డీవో- శ్రీనివాస్
దోమ	డీవైఎస్‌వో- హనుమంతరావు
కులకచర్ల	ఎస్సీ కార్పొరేషన్ ఈడీ-బాబూమోజెస్
పూడూరు	డీపీవో- జయసుధ
కొడంగల్	డీఎఫ్‌వో(ఫారెస్ట్)-జ్ఞానేశ్వర్
దౌల్తాబాద్	ఏడీ ఏహెచ్-సదానందం
బొంరాస్‌పేట	సర్వేల్యాండ్ రికార్డ్స్ ఏడీ-రామ్‌రెడ్డి
తాండూరు	డీహెచ్‌ఎస్‌వో- ఎం.ఏ సత్తార్
పెద్దేముల్	మైన్స్ ఏడీ-సత్యనారాయణ
యాలాల	మార్కెటింగ్ ఏడీ- సారంగపాణి
బషీరాబాద్	డీఏవో(ఆడిట్)- వీరభద్రారావు
నవాబుపేట	డీఏవో- గోపాల్

వికారాబాద్ జిల్లా పరిషత్ కార్యాలయం

వన మహోత్సవంపై జరిగిన అధికారిక సమావేశానికి హాజరైన ఇటీవల సస్పెన్షన్‌కు గురైన ఎఫ్ఆర్‌వోలు అరుణ, శ్యాంసుందర్ (సర్కిల్‌లో ఉన్నవారు)

అధికారిక మీటింగ్‌లో వేటుపడిన ఎఫ్ఆర్‌వోలు

- అమలుకాని పీసీసీఎఫ్ సస్పెన్షన్ ఉత్తర్వులు
- తునికాకు బోనస్ డబ్బు స్వాహాతో వికారాబాద్, తాండూరు ఎఫ్ఆర్‌వోలపై వేటు

వికారాబాద్, జూలై 4 (నమస్తే తెలంగాణ): తునికాకు బోనస్ స్వాహా విషయంలో సస్పెండ్ అయిన ఎఫ్ఆర్‌వో(ఫారెస్ట్ రేంజ్ అధికారులు)లు అధికారిక మీటింగ్‌లో పాల్గొన్నారు. గురువారం కలెక్టరేట్‌లో వనమహోత్సవంపై ఎంపీడీవోలు, తహసీల్దార్లతో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ సుధీర్‌కుమార్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో బుధవారం సస్పెన్షన్ వేటుపడిన వికారాబాద్, తాండూరు ఎఫ్ఆర్‌వోలు అరుణ, శ్యాంసుందర్ పాల్గొన్నారు. బుధవారం అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ సస్పెన్షన్ ఉత్తర్వులు జారీచేసినా అమలు కాకపోవడం శోచనీయం.

అయితే సస్పెన్షన్ వేటుపడిన ఎఫ్ఆర్‌వోలు ఆ ఉత్తర్వులను నిలుపుదల చేయించేందుకు తమ ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. ఇందులో భాగంగానే స్పీకర్ ప్రసాద్‌కుమార్, అటవీశాఖ మంత్రి కొండా సురేఖలను ఎఫ్ఆర్‌వోల అసోసియేషన్ తరపున కలిసి ఆ ఉత్తర్వులను అమలు చేయొద్దని కోరినట్లు సమాచారం. ఆ అధికారులు అధికారిక సమావేశంలో పాల్గొనడంపై జిల్లా అంతటా చర్చ జరిగింది. ఈ విషయమై జిల్లా అటవీశాఖ అధికారి జ్ఞానేశ్వర్‌ను వివరణ కోరగా.. సస్పెన్షన్ ఉత్తర్వులను అమలు చేయొద్దని మౌఖిక ఆదేశాలు రావడంతో ఈ సమావేశంలో వికారాబాద్, తాండూరు ఎఫ్ఆర్‌వోలు పాల్గొన్నట్లు ఆయన తెలిపారు.

ధరణి సమస్యలు | వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

పరిష్కరించాలి

బొంరాస్‌పేట, జూలై 4 : ధరణి పోర్టల్‌లో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను త్వరగా పరిష్కరించాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన దుద్యాల మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ధరణి సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. ఫైళ్లను పరిశీలించి పెండింగ్‌లో ఉన్న సమస్యలపై ఆరా తీశారు. ధరణిలోని వివిధ మాడ్యూళ్లలో158 సమస్యలున్నట్లు తహసీల్దార్ దానయ్య కలెక్టర్‌కు వివరించగా.. వాటి పరిష్కారానికి త్వరగా చొరవ చూపాలని ఆదేశించారు. అనంతరం కొత్తగా ఏర్పడిన దుద్యాల మండలంలో ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాల ఏర్పాటుకు కావాల్సిన స్థలాన్ని 191 సర్వేనంబరులో కలెక్టర్ పరిశీలించారు. ఈ సర్వే నంబరులో 74 ఎకరాల ప్రభుత్వ స్థలం మాత్రమే ఉండగా.. ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి స్థలం ఎంత మేరకు అనువైనదో పరిశీలించారు. ప్రజలు తమ సమస్యలను వివరిస్తూ కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, తాండూరు ఆర్డీవో శ్రీనివాస్‌రావు, ఆర్ఐ రవిచారి పాల్గొన్నారు.

పాలనపై దృష్టి పెట్టండి

- పైరవీలు తర్వాత చేసుకోండి
- కాంగ్రెస్ సర్కార్‌కు బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి సూచన
- చేవెళ్లలో మండల స్థాయి మీటింగ్

చేవెళ్ల రూరల్, జూలై 4 : సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పైరవీలు మాని పాలనపై దృష్టి సారించాలని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి సూచించారు. గురువారం మండలంలోని ఇబ్రహీంపల్లి గ్రామ రెవెన్యూలోని బర్కల రాంరెడ్డి వ్యవసాయ క్షేత్రంలో జరిగిన బీఆర్ఎస్ పార్టీ మండల నాయకుల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ప్రజలు అన్ని రకాలుగా ఇబ్బంది పడుతున్నారని ఆరోపించారు. ఎన్నికల ముందు అలవి కాని హామీలిచ్చి.. అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి విషయాన్నే మరిచిపోయారని మండిపడ్డారు. బీఆర్ఎస్ పార్టీ పదేండ్ల కాలంలో చేవెళ్ల నియోజకవర్గాభివృద్ధికి ఎంతో కృషి చేసిందని గుర్తు చేశారు. వంతెనలు, కల్వర్టులు, రోడ్లు తదితర మౌలిక వసతులను కల్పించిందన్నారు. చేవెళ్ల ప్రజలు ఎంతో చైతన్యవంతులని..ఎవరిని కూడా గుడ్డిగా విశ్వసించారన్నారు. రానున్న రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేసి వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి వద్దామన్నారు. కొందరు పార్టీ మారినా బీఆర్ఎస్‌కు నష్టమేమీలేదని.. నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి పార్టీని ముందుకు నడిపించాలన్నారు. గత కేసీఆర్ సర్కార్ వర్షాలు కురిసిన మొదటి వారంలోనే రైతుబంధు పెట్టుబడి సాయాన్ని అందించిందని.. 24 గంటలపాటు విద్యుత్తును సరఫరా చేసి రైతులకు అండగా నిలిచిందని అన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్ ప్రజలను పట్టించుకోవడం లేదన్నారు. కాంగ్రెస్‌లోకి వెళ్లిన చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య నియోజకవర్గంలో హైవే నిర్మాణ పనులతోపాటు పలు అభివృద్ధి పనులను పూర్తి చేయించాలని.. లేదంటే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లాలో బీఆర్ఎస్‌ను తిరుగులేని శక్తిగా తీర్చిదిద్ది పూర్వ వైభవం దిశగా అడుగులు వేస్తామన్నారు.

కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పెట్లోళ్ల ప్రభాకర్, షాబాద్ జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి, రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి మాజీ చైర్మన్ పులుమామిడి నారాయణ, బీఆర్ఎస్‌వీ రాష్ట్ర కార్యదర్శి చటారి దశరథ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు అనంత్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి నరేందర్ రెడ్డి, బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ ఎంపీపీ బాల్‌రాజ్, మాజీ వైస్ ఎంపీపీ శివప్రసాద్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ నర్సింహులు, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ యాదగిరి, బీఆర్ఎస్ నాయకులు మాధవ్ గౌడ్, చందు, మాజీ ఎంపీటీసీ రవీందర్‌యాదవ్, మైనార్టీ నాయకుడు అబ్దుల్ ఘనీ, మాజీ ఎంపీటీసీ ఎల్లన్న, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ వెంకటేశ్, వివిధ మండలాల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు పట్లోళ్ల కార్తీక్ రెడ్డి